జ్యోతి మినీకథలపోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

# మనిషి

## ఎ.డి.గౌరీశంకర్

మిట్ట మధ్యాహ్నం.

ఎండ తీవ్రంగా ఉంది.

రొప్పుతూ రొజుతూ ఓ కృశించిన స్థూల కాయం రోడ్డుమీద నడుస్తూంది

వయస్సు అరవై దాటింది జుట్టు, మెళ్ళో రుద్రాక్షమాల. నెత్తిమీద వొళ్ళంతా విభూది పట్టెలు శరీరం మీద చొక్కాలాంటిది ఏదీ లేదు. ఓ కండువా మాత్రం భుజంమీద వుంది. చేతిలో వో చిన్నసైజు మూట.

వేషం చూచి సులభంగా కనుక్కోవచ్చు ఏ గుడి పూజారో లేదా పౌరోహిత్యం చేసుకొనే సాంప్రదాయ బాపడని. మడి మైల పాటించేవాడని.

అడుగుపై అడుగు పడుతూంది ఆయాస పడుతూంది శరీరం చెమటకు నెత్తిమీది విభూతి పట్టెలు తుడుచుకపోతూన్నాయి. జంధ్యం వొంటికి అతుక్కుపోయింది.

జనసంచారం లేకుండా బిక్కుబిక్కుమంటూంది రోడ్డు.

అప్పుడే చర్చిగేటు తీసుకొంటూ బయటికి వస్తూన్నాడు జాన్. ప్రార్థన చేసుకొని వస్తున్నట్లున్నాడు మౌనంగా తలొంచుకొని నడుస్తున్నాడు.

రోడ్డు మలువు వచ్చింది. వోమారు తలెత్తి చూచాడు.

అడుగుపైన అడుగులేస్తూ తడబడుతూ నడుస్తూ ముందుకు పోతూన్న ఆకారం కనబడింది జాన్‌కు.

జాన్ కాస్తా అడుగులు త్వరత్వరగా వేసాడు.

"దబ్బు" మంటూ శబ్దం.

"అమ్మా" అంటూ మూలుగు. రోడ్డుమీద కుప్పలా కూలిపోయింది ఆ ఆకారం.

జాన్ పరుగెత్తుకొని వెళ్ళి నెమ్మదిగా అతన్ని లేపాడు. ఆయాస పడుతూంది ఆ ప్రాణం. అతి కష్టంమీద వూపిరి పీల్చుకోవటం జరుగుతూంది.

అతన్ని రోడ్డుప్రక్కగా వున్న అరుగుమీద పడుకోబెట్టాడు జాన్.



జాన్‌కు అతడి పరిస్థితి అర్థమయింది. కొన వూపిరితో వూగిసలాడుతూంది శరీరం.

"దా.... దాహం " అంటూ హీనస్వరం.

అటు యిటు చూచాడు జాన్. ఎవరు వచ్చే జాడ కనిపించలేదు వొక్క నిముషం ఆలోచించాడు. ఏదో నిర్ణయించుకున్నాడు.

ఒక్క దూకులో పరుగెత్తి చర్చి లోపలికెళ్ళి వొక గ్లాసు మంచినీళ్లు పట్టుకొచ్చాడు.

చర్చి గేటు వేస్తూ వో మారు ఎత్తైన చర్చి గోపురంవైపు చూచాడు.

క్రాస్ అగుపించింది మనస్సులో నమస్కరించాడు. మరుక్షణం జాన్ అతనివద్దకు చేరుకొన్నాడు.

మెల్లగాకళ్లు తెరచిచూచింది ఆకారం.

"ఆ" అంటూ నోరు తెరచింది.

జాన్ మెల్లగా అతడి నోట్లో నీళ్ళు పోసాడు. అతడి కళ్ళలో కృతజ్ఞత.

జాన్‌కేదో తృప్తి.కాసేపు మౌనం

"నీ పే రు నా . .య .నా"

జాన్ కాసేపు వూరకుండి " ...జా . జాన్ . జానకీరామ్ ..." అంటూ సమాధానమిచ్చాడు

ఆ పేరు ఎంతో తృప్తినిచ్చినట్లుంది ఆ ప్రాణానికి.

"రా మ రామ . " అంటూ గొణుక్కున్నాడు

అతడు చివరిసారిగా శ్వాస పీల్చి కొని కన్ను మూసాడు

జాన్ షర్ట్ లోపలినుండి మెడకు వేసుకొన్న చెయిన్ బయటికి తీసి దానికి చివర్లోవున్న క్రాస్‌ను వోమారు కళ్ళకద్దుకొని ముద్దుపెట్టుకున్నాడు. ★